13వ పాఠం జూన్ 19-25

# క్రొత్త నిబంధన జీవితము

**సబ్బాతు మధ్యాహ్నము** **జూన్ 19**

**ఈ వారమునకు చదువ వలసిన వాక్యములు : 1యోహాను 1:4; యోహా 5:24; రోమా 3:24,25; 2 కొరింథి 5:21; 1యోహా 4:16; ప్రక 2:11; 20:6, 14; 21:8.**

**కంఠతవచనము: "గొఱ్ఱెలకు జీవము కలుగుటకును అది సమృద్ధిగా కలుగుటకును నేను వచ్చితిని" (యోహాను 10:10).**

ఈ త్రిమాసమంతయు నిబంధన గూర్చి అధ్యయనము చేసాము. ఈ సందర్భముగానే దేవుడు 'మిమ్ముల్ని పాపము నుండి ఈ విధముగా రక్షించబోవుచున్నాను" అనే మౌలిక విషయాన్ని ఆయన తెలిపాడు.

నిబంధన ప్రకారము ఒక గొప్ప ముగింపుగా నూతన పర్చబడిన ఈ లోకములో శాశ్వత జీవితమును అనుగ్రహిస్తానని వాగ్దానము చేసి యున్నప్పటికి, ఆ నిబంధన దీవెనలను అనుభవించుటకు ఆ ముగింపు సమయము వరకు మనము వేచి యుండనవసరము లేదనియు, ఆ దీవెనలను నేడే మనము పొందవచ్చునని గ్రహించవలసి యున్నాము. ఇప్పుడు కూడా దేవుడు మన జీవితాలను సంరక్షించుచున్నాడు. ఇప్పుడే మేలైన వాటిని మనము అనుభవించాలని ఆయన కోరుచున్నాడు. నిబంధన చేయుట అనగా, ఈ కార్యములను ఇప్పుడు నెరవేర్చి ప్రతి ఫలము కొరకు ఎంతో కాలము వేచియుండాలనే నియమము అందులో లేదు. ఎవరైతే విశ్వాసముతో నిబంధన బాంధవ్యములోనికి ప్రవేశిస్తారో అటువంటి వారికి ప్రతిఫలములు, వరములు వంటి దీవెనలను ఇక్కడే మరియు ఇప్పుడే అనుభవించుటకు ఆయన అనుగ్రహిస్తాడు.

ఈ వారం పాఠములో నిబంధనకు సంబంధించిన విషయాలను గూర్చి అధ్యయనం చేయునపుడు, దేవుడు మన హృదయ ద్వారముల యొద్ద తట్టి పిలిచినపుడు మన హృదయ ద్వారములు తెరచి ఆయనను ఆహ్వానించుట ద్వారా, ఆయన కృప వలన కొన్ని దీవెనలు తక్షణమే మనము అనుభవించుటకు అనుగ్రహించబడుననే విషయాన్ని చదువుకొనబోవుచున్నాము. ఈ వారము చదువుకొనబోయే దీవెనలు మాత్రమే కాదు, ఇది కేవలం ఆరంభము మాత్రమే, ఇక ఎన్నటికి అంతము లేని రీతిలో దేవుడు కుమ్మరించబోవుచున్నాడు.

## ఈ వారం పాఠములోని ముఖ్యాంశములు

మనము సంతోషముగా ఎందుకుండాలి? ఆ వాగ్దానము నెరవేర్చమని దేవునిని ఆధారము చేసికొని ఏమి అడుగగలము? నేర భారము నుండి మనలను విముక్తులనుగా చేయు విషయము నిబంధనలో ఏమున్నది? ఒక నూతన హృదయము కలిగియుండుట అనగా అర్ధమేమిటి?

– జూన్ 26, సబ్బాతుదినమున ఈ వారం పాఠమును అధ్యయనము చేయుటకు సిద్దపడుడి.

**ఆదివారం** **జూన్ 20**

## సంతోషము

"మన సంతోషము పరిపూర్ణమవుటకై మేమీ సంగతులు వ్రాయుచున్నాము" (1యోహాను 1:4).

ఇక్కడ యోహాను వ్రాసిన విషయాన్ని పరిశీలించండి. నిబంధన ప్రజలుగా మనకున్న గొప్ప ప్రయోజనములలో ఒకటైన– అనగా సంతోషమునకు సంబంధించిన వాగ్దానము గూర్చి అతి సామాన్యమైన మాటలతో ఆయన వివరించిన విధానమును చూడండి.

క్రైస్తవులుగా మనము అనుభూతితో వ్యవహరించకూడదు అని పదేపదే మనకు గుర్తు చేస్తుంటారు. విశ్వాసము అనునది అనుభూతి కాదు. మనకు కలిగే భావములు అవతలకు దాటిపోయినప్పుడు అది అంతా వాస్తవమవుతుంది. అయితే అదే సమయములో మనకు భావములు, ఉద్రేకములు మరియు తీవ్రమైన ఆవేశములు వంటివి లేనియెడల మనము జీవించుచున్న మానవులము కాలేము. మనకు కలిగే భావములను నిరాకరించను లేము. మనము చేయవలసినదేమిటంటే వాటిని అర్ధము చేసుకోవాలి. వాటికి చెందినసరైన స్థానమునివ్వాలి. సాధ్యమైనంతవరకు వాటిని స్వాధీనంలో ఉంచుకోవాలి. అయితే వాటిని నిరాకరించడమంటే, మానవులమైయున్నామనే విషయాన్ని నిరాకరించినట్లవుతుంది. నిజముగా ఈ వాక్యము చెప్పుచున్నట్లు మనకు భావములు ఉండుటయే కాకుండా (ఈ విషయములో సంతోషము) అతి సంపూర్ణమైనదిగా ఉండాలి. దీనిని బట్టి భావాలను అరుదుగా నిరాకరించడం జరుగుతుంది. అవునా?

**పైన పేర్కొనబడిన వాక్యము అధ్యాయము యొక్క ఆరంభములోనే వ్రాయబడినప్పటికి దాని సందర్భమును చదువవలసియున్నాము. ఆదిమ క్రైస్తవుల యొక్క సంతోషము దేని వలన పరిపూర్ణ మవుతుందని యోహాను వ్రాస్తున్నాడు? అది వారికి సంతోషమును ఎందుకు ఇస్తుంది?**

---------------------------------------------

---------------------------------------------

ఆరంభములో ఉన్న 12 మందిలో యోహాను ఒకడు. క్రీస్తు యొక్క మూడున్నర సంవత్సరాల సేవ యొక్క ఆరంభము నుండి దాదాపుగా ఉన్నాడు. యేసు జీవితములో ఎక్కువ ఆశ్చర్యమును కలిగించిన సంఘటనలలో కొన్నింటికి యోహాను సాక్షిగా కూడా ఉన్నాడు. (యోహాను సిలువ యొద్ద, గెత్సెమనె యొద్ద, రూపాంతరము చెందే సమయములో కూడా ఉన్నాడు) అతను ఒక ప్రత్యక్ష సాక్షిగా ఈ అంశము మీద మాట్లాడుటకు అన్ని అర్హతలు ఉన్నావాడే. సందేహము లేదు.

అయితే ఆయన ఇక్కడ ఉద్ఘాటించే విషయము తనను గూర్చి కాదు. శిష్యులు ఒకరితో ఒకరు సహవాసము కలిగియుండుటకు మాత్రమే కాక, అందరూ దేవునితో సహవాసం కలిగియుండుటకు యేసు ఏమి చేసాడో ఆ విషయాన్ని యోహాను వివరిస్తున్నాడు. దేవునితో సన్నిహిత బాంధవ్యమును కలిగియుండుటకు మనకు మార్గమును తెరచి ముందు సహవాసము అటు తరువాత బాంధవ్యములోనికి ప్రవేశించే విధముగా యేసు ప్రోత్సహించెను. ఆ బాంధవ్యము యొక్క ఫలితమే వారు పరలోకపు తండ్రితో పొందిన సంతోషము. తండ్రి అందరిని ప్రేమించి తన కుమారుని ద్వారా తనను తాను అర్పించుకున్నాడు.

**యేసుతో నీకున్న బాంధవ్యమును గూర్చి నీ సాక్ష్యమేమైయుంది? యోహాను చెప్పినట్లు ఇతరులలో సంతోషము అధికమవునట్లు నీవు ఏవిధంగా సహాయపడగలవు?**

**సోమవారం** **జూన్ 21**

## అపరాధ భారము నుండి విడుదల

"కాబట్టి యిప్పుడు క్రీస్తు యేసునందున్న వారికి ఏ శిక్షావిధియులేదు" (రోమా 8:1).

ఒక యౌవన స్త్రీ క్రూరంగా హత్య చేయబడినది. ఆమెను హత్య చేసిన వారెవరో తెలియలేదు. పోలీసులు ఒక వల పన్ని రహస్యముగా ఒక మైక్రో ఫ్రోన్‌ను ఆమె సమాధిలో అమర్చారు. ఆమె మరణించి అనేక నెలలు గడిచిన తరువాత ఒక సాయంత్ర సమయాన ఒక యువకుడు ఆమె సమాధి యొద్దకు వచ్చి, మోకరించి దుఃఖిస్తున్నాడు. ఆ చనిపోయిన స్త్రీని క్షమించమని వేడుకుంటున్నాడు. అతని మాటలను గుర్తించి చేసిన నేరమునకు బంధించారు.

ఆ మనిషిని సమాధి యొద్దకు ఎవరు నడిపించారు? అపరాధ భావం అతడిని అక్కడకు నడిపించింది. ఆ యౌవనస్తుడు చేసిన నేరము వంటిది మనలో ఎవరూ చేయకపోయినను, మనమందరము తప్పు చేసిన వారి క్రిందకే వస్తాము. అందరము సిగ్గును కలిగించే పనులను

చేసియున్నాము. చేసిన పనులను చేయనట్లుగా తుడిచి వేయుటకు ప్రయత్నిస్తాము కాని అవి ఎన్నటికి తుడిచివేయబడవు.

అయితే యేసును బట్టియు, మరియు క్రొత్త నిబంధన రక్తమును బట్టియు మనము అపరాధ భారముతో జీవించనవసరము లేదు. నేటి దినమునకు ఏర్పాటు చేయబడిన వాక్యము ప్రకారము మనకు వ్యతిరేకముగా ఏ శిక్షావిధియులేదు. మన కడపటి న్యాయమూర్తి మనమీద ఎటువంటి నేరారోపణ లేదని, అపరాధ భారముతో కృంగిపోవలసిన నేరము ఏమీ చేయలేదనే వారితో కలిపి మనలను లెక్కించనైయున్నాడు.

**రోమా 8:1ని అర్థము చేసుకొనుటకు ఈ వాక్యములు మనకు ఏవిధముగా సహాయపడును? యోహా 5:24; రోమా 3:24, 25; 2కొరింథి 5:21.**

---------------------------------------------

---------------------------------------------

మనము ఇక అపరాధ భారము క్రింద జీవించనవసరము లేదని దేవునితో నిబంధన బాంధవ్యములో జీవించుట వలన ఒక గొప్ప వాగ్దానమును పొంది యున్నాము. నిబంధన రక్తమును బట్టి దేవునితో నిబంధన బాంధవ్యములో జీవిస్తామని ఎన్నిక చేసుకొనుట వలనను విశ్వాసము, మారుమనస్సు, విధేయతకు సంబంధించిన షరతులను పాటిస్తామని తీర్మానము చేసుకొనుటవలనను మనము మోయుచున్న అపరాధ భారము తొలగించబడింది. మనము పాపులము, బొత్తిగా చెడిపోయిన వారమని సాతాను మనకు గుర్తు చేస్తూ ఈ పరిస్థితిలో దేవుడు మనలను అంగీకరించడు అని మన చెవిలో వాడు గుసగుసలాడేటప్పుడు, యేసు వలె అనగా, యేసు అరణ్యములో శోధింపబడినప్పుడు ఏవిధముగా సాతానుకు జవాబు చెప్పెనో అదే రీతిగా మనము కూడా బైబిలు నుండి వాక్యము నెత్తి సమాధానము చెప్పవలసియున్నాము. సాతానుకు జవాబు చెప్పుటకు బైబిలు నుండి ఎన్నిక చేయబడిన కొన్ని వాక్యాలలో రోమా 8:1 చాలా ముఖ్యమైనది. మనము మన పాపముల యొక్క పరిహారమును చెల్లించవలసియుండగా అది మనకు సాధ్యము కాని పనియని యెంచి, యేసు మన కొరకు ఆయన చెల్లించెను. ఇప్పుడు ఆయన పరలోకపు తండ్రి యొక్క సన్నిధిలో నిలువబడి, ఆయన చిందించిన రక్తమును బట్టి, మన పాపముల స్థానములో ఆయన నీతిని బట్టి మనలను నీతిమంతులుగా ఎంచమని బ్రతిమాలుచున్నాడు.

**నీవు చేసిన పాపములన్నింటిని దేవుడు క్షమించాడు అనే విషయము నీ జీవితములో ఎటువంటి మార్పును తీసుకొనివచ్చెను? నీ యెడల ఇతరులు చేసిన తప్పిదముల విషయమై నీవేమి చేస్తావు?**

మంగళవారం జూన్ 22

## క్రొత్త నిబంధన మరియు నూతన హృదయము

**"క్రీస్తు మీ హృదయములలో విశ్వాసము ద్వారా నివసించునట్లుగాను తన మహిమైశ్వర్యము చొప్పున మీకు దయ చేయవలెననియు, మీరు దేవుని సంపూర్ణతయందు పూర్ణులగునట్లుగా ప్రేమయందు వేరుపారి స్థిరపడి, సమస్త పరిశుద్ధులతో కూడ దాని వెడల్పు పొడుగు లోతు ఎత్తు ఎంతో గ్రహించుకొనుటకును, జ్ఞానమునకు మించిన క్రీస్తు ప్రేమను తెలిసికొనుటకును తగిన శక్తిగల వారు కావలెననియు ప్రార్థించుచున్నాను" (ఎఫెసీ 3:17-19).**

ఈ త్రిమాసములోనే దీనికి ముందు పాఠములో క్రొత్త నిబంధనను గూర్చి చదువుకున్నపుడు దాని ప్రకారము దేవుడు తన ధర్మవిధులను "వారి హృదయముల మీద వ్రాసెను" అని చెప్పెను (యిర్మియా 3:31-33) అంతే కాక నేటి దినము కొరకు ఏర్పాటు చేయబడిన పై వాక్యముల ప్రకారము క్రీస్తే విశ్వాసుల యొక్క హృదయాలలో నివసించనైయున్నట్లు పలికెను. నిజమే. క్రీస్తు మరియు ఆయన ధర్మశాస్త్రము ఒక్కటైయున్నవి గనుక క్రీస్తు యొక్క ఆజ్ఞలు నివసించుట అనే భావము వచ్చే గ్రీకు పదమును బట్టి అందులో స్థిరపడిపోవుట లేక దానికి స్థిరమైన అనే భావము కలుగుచున్నది. క్రొత్త నిబంధన ద్వారా ఒక నూతన హృదయము వాగ్దానము చేయబడినది.

**మనకు ఒక నూతన హృదయము ఎందుకవసరము? నూతన హృదయము కలిగిన వారి జీవితాల ద్వారా ఎట్టి మార్పులు కనిపిస్తాయి?**

నేటి కొరకు ఏర్పాటు చేయబడిన వాక్యాన్ని మరొకసారి చదవండి. ఇక్కడ పౌలు "ప్రేమ"ను గూర్చి నొక్కి చెప్పుచున్నాడు. ఆయన మాటల ప్రకారము మనము ప్రేమయందు వేరుపారి స్థిరపడవలసియున్నాము. ప్రేమ శాశ్వత కాలము నిలుచును. అది పునాదిగా ఉన్నప్పుడు మన జీవితాలకు స్థిరత్వము నిలకడ, ధృడత్వము ఏర్పడుతుంది. దేవుని కొరకు మరియు ఇతరుల కొరకు మన విశ్వాసము ప్రేమలో వేరుపారవలసియున్నది (మత్తయి 22:37-39; 1కొరింథి 13). ప్రేమ శూన్యములోనుండి రాదు. అయితే దేవుని ప్రేమను చూచినపుడు, యేసులో దేవుని ప్రేమ బయలుపర్చబడినట్లు మనలో కూడా అది పుట్టి నూతన తలంపుల రీతిలోను, నూతన కోరికల రూపములోను, నూతన ఉద్దేశములతో బయలుపర్చబడుతుంది. దేవుడు మన యెడల చూపే ప్రేమకు మనము స్పందించినపుడు మన హృదయములను మార్చివేయుటకు అవకాశము ఇచ్చిన వారమవుదుము. తరువాత ఇతరుల కొరకు ప్రేమను మన హృధయములలో ఆయనే స్థాపించును.

**1 యోహాను 4:15 చదవుడి. పౌలు ఎఫెసి 3:17-19లో వ్రాసిన దానితో ఏవిధముగా ఇది సంబంధము కలిగియుంటుంది?**

**మనము నేడు చదివిన వాక్యాల ప్రకారము మనలో ఆ వాగ్దానాలు నెరవేరునట్లు నీవేమి చేతువు? మార్పు చెందవలసిన విషయాలేమైనా నీలో ఉన్నవా? మార్పు సాధ్యము కానిచో దేవుని సంపూర్ణతను మన అనుభవములో పొందగలమా? ఎఫెసి 3:19. నీ జీవితంలో తీసుకొనే మార్పులను గూర్చి జాబితా వ్రాయండి.**

బుధవారం జూన్ 23

## క్రొత్త నిబంధన మరియు నిత్యజీవము

"అందుకు యేసు – పునరుత్థానమును జీవమును నేనే, నాయందు విశ్వాసముంచువాడు చనిపోయినను బ్రదుకును. బ్రదికి నాయందు విశ్వాసముంచు ప్రతివాడును ఎన్నటికి చనిపోడు. ఈ మాట నమ్ముచున్నావా?" అని ఆమెను అడిగెను (యోహాను 11:25,26).

నిత్యజీవమునకు రెండు పరిమాణములున్నవి. వర్తమానమునకు చెందిన పరిమాణము విశ్వాసి సమృద్ధి జీవితమును ఇప్పుడే అనుభవించే విధముగా నడపబడుట చూపును (యోహాను 10:10) దానిలో భాగముగా నేటి మన జీవితాలకు అవసరమైన వాగ్దానాలు నెరవేర్చబడును.

భవిష్యత్తుకు సంబంధించిన పరిమాణములో వాగ్దానము చేయబడిన నిత్య జీవము ఉంటుంది. దానికి వాగ్దానములో భాగముగా దేహము పునరుత్తానము చెందుతుంది (తిరిగి లేపబడుతుంది) యోహా 6:26, 29; 6:39) అది భవిష్యత్తులో సంభవించినప్పటికి ఆ ఒక్క సంఘటనే మిగిలిన వాటికి విలువను ఇస్తుంది. మరియు క్రైస్తవులుగా దాని యొక్క నెరవేర్పునందే మన నిరీక్షణ ఆధారపడి ఉంటుంది.

**నేటి దినమునకు ఏర్పాటు చేయబడిన వాక్యమును మరొకసారి చదవండి. ఇక్కడ యేసు చెప్పుచున్నదేమిటి? ఎక్కడ నిత్యజీవమును కనుగొనగలము? ఎవరైతే సజీవులుగా ఉండి ఆయనను నమ్మెదరో అట్టివారు చనిపోయినా ఎన్నటికి చనిపోరు అని యేసు పలికిన మాటలను ఏవిధముగా అర్ధము చేసుకొనగలము? (ప్రక 2:11; 20:6, 14; 21:8)**

అవును అందరము మరణిస్తాము. అయితే యేసు చెప్పిన మాటల ప్రకారము ఎవరైతే ఆయన యందు విశ్వాసముంతురో అట్టి వారికి ఈ మరణం కేవలము ఒక నిద్ర వంటిది. తాత్కాలికమైనదైయుండును. అది జీవపునరుత్తానమునకు నడిపిస్తుంది. క్రీస్తు తిరిగి వచ్చినపుడు క్రీస్తునందు మృతులైన వారు అమరులుగా (శాశ్వత కాలము జీవించేవారు) లేపబడుదురు. క్రీస్తునందు సజీవులుగా జీవించుచున్నవారు తృటిలో అమరత్వములోనికి మార్చబడుదురు. క్రీస్తుకు చెందిన సజీవులు, మృతులు ఒకే రకమైన పునరుత్తానము ద్వారా పొందే దేహమును కలిగి ఉంటారు. దేవుని ప్రజలకు ఆ క్షణము నుండి శాశ్వత కాల జీవితము ఆరంభమవుతుంది.

మన జీవితము యొక్క ముగింపు సమాధితోనే అంతం కావడము లేదని, అంతము లేని ఒక నూతన జీవితములోనికి ప్రవేశింతుమనియు, అది శాశ్వత కాలము జీవిస్తుందని తెలుసుకోవడం నిజముగా గొప్ప సంతోషకరమైన విషయం.

"క్రీస్తు మనతో ఏక శరీరమయ్యాడు. తద్వారా మనము ఆయనతో ఏకాత్మ కలిగియుంటాము. ఈ కలయిక వలననే మనము సమాధులలో నుండి వెలుపలకు రాగలుగుతాము. తద్వారా క్రీస్తు యొక్క శక్తి బయలుపర్చబడడమే కాకుండా, మన విశ్వాసము ద్వారా ఆయన జీవితము మనదవుతుంది. క్రీస్తును ఆయన నిజమైన స్వభావములో చూచిన వారు, వారి హృదయములలోనికి ఆయనను ఆహ్వానించిన వారికి నిత్యజీవము అనుగ్రహించబడుతుంది" –ఎలెన్ జి వైట్, యుగయుగాల అభీష్టము, పుట 388.

**ఏవిధముగా నేడు మనము నిత్యజీవము యొక్క ఫలములను అనుభవించగలము? నిత్యజీవమునకు సంబంధించిన వాగ్దానము ద్వారా కలిగే దీవెనలను గూర్చి వ్రాయండి. ఇతరులతో ఈ నిరీక్షణను గూర్చి వాగ్దానముల యొక్క నెరవేర్పులను గూర్చి ఏవిధముగా పంచుకొనగలరు?**

గురువారం **జూన్ 24**

## క్రొత్త నిబంధన మరియు సంఘ పరిచర్య

" కాబట్టి మీరు వెళ్ళి సమస్త జనులను శిష్యులనుగా చేయుడి, తండ్రి యొక్కయు కుమారునియొక్కయు, పరిశుద్ధాత్మ యొక్కయు నామములోనికి వారికి బాప్తిస్మమిచ్చుచు, నేను మీకు ఏయే సంగతులను ఆజ్ఞాపించితినో వాటినన్నిటిని గైకొనవలెనని వారికి బోధించుడి. ఇదిగో నేను యుగ సమాప్తి వరకు సదాకాలము మీతో కూడా ఉన్నానని వారితో చెప్పెను" (మత్తయి 28:19,20).

"అర్ధరహితమైన విషయాల వలన కలిగే భారము"తో జనులు ప్రపంచమందంతట తరచుగ బాధపడుతున్నారు అని దక్షిణాఫ్రికా రచయిత లారెన్సు వేండర్ పోస్టు చెప్పియున్నాడు. ప్రజలు జీవమనే వరము కలిగియున్నట్లు గుర్తించారు. అయితే ఆ వరముతో వారేమి చేయాలో తెలియదు. ఆ వరము యొక్క లక్ష్యమేమిటో వారికి తెలియదు. జీవమనే ఆ వరమును ఏవిధముగా వాడుకోవాలో తెలియదు. చాలా అరుదైన పుస్తకాలు ఎన్నో కలిగియున్న ఒక గ్రంథాలయమును, ఒక వ్యక్తికి చదువుటకు కాకుండా ఆ పుస్తకాలను వరుస పెట్టి కాల్చివేయుటకు ఇచ్చినట్లుగా ఉంటుంది కొందరు జీవితాలలో. ఎంతో విలువైన దానిని అవిధముగా వృధా చేయడము ఎంత ఘోరమైన విషయము.

క్రొత్త నిబంధన క్రైస్తవునికి వారు బాధపడుతున్న సమస్యల వలన వచ్చిన సమస్య కాదు గాని సిలువ వేయబడి మరియు తిరిగి లేచిన రక్షకునిగూర్చి లోకమునకు ప్రకటించవలసియున్నదనేది వారికున్న సమస్యయైయున్నది. మత్తయి 28:19, 20లో ఇవ్వబడిన నిస్సందేహమైన పిలుపును బట్టి విశ్వాసికి ఒక పరిచర్య మరియు ఒక లక్ష్యముతో కూడుకున్న భారము అప్పగించబడెను. అది సమస్య కాదు, అది ఒక ఆధిక్యత. ఈ లోకములో మనమేమి చేసిన చివరికి అది ఈ లోకముతోనే అంతమైపోవుతుంది గాని ఇతరులకు సువార్తను ప్రకటించే సేవ శాశ్వతమైన ముద్రను వేస్తుంది. మన జీవిత లక్ష్యమైన క్రీస్తును గూర్చిన పరిచర్య ద్వారా మన జీవితమునకు ఒక అర్థాన్నిస్తుంది.

**పై వాక్యములో ఉన్న వివిధ అంశాలను వేరు చేసి చూడండి. యేసు మనలను చేయమని చెప్పిన ప్రత్యేకమైన విషయాలు ఏమిటి? క్రీస్తు ఆజ్ఞాపించిన దానిని చేయుటకు అవసరమైన విశ్వాసము మరియు ధైర్యమును ఇచ్చుటకు మనకున్న వాగ్దానమేమిటి?**

----------------------------------------------------

----------------------------------------------------

**క్రైస్తవులైన మనకు మన ప్రభువే ఒక స్పష్టమైన ఆదేశమును ఇచ్చాడు. మనము ఎవరైనప్పటికి, ఎక్కడున్నప్పటికి, మనకున్న పరిమితులు ఏమైనప్పటికి, మనమందరము ఒక్కొక్క పాత్రను పోషించవచ్చును. నీవేమైనా చేస్తున్నావా? ఇంకా ఎక్కువ చేయగలవా? మీ తరగతి అంతా కలిసి ఏమి చేయగలదు?**

**శుక్రవారం** **జూన్ 25**

**అదనపు అధ్యయనము**

ఎలెన్ జి వైట్, మహా సంఘర్షణ నుండి "దేవుని యొక్క జనులు విడుదల చేయబడిరి" పుటలు 635-645. క్రీస్తు యొద్దకు మెట్లు అనే పుస్తకము నుండి 'ప్రభువునందు ఆనందించుట' పుటలు 115-126 చదువుడి.

"పరిశుద్ధుడైన దేవుని కుమారుడు భరించుటకు తన సొంత పాపములు లేక వేదనలు అంటూ ఏమియు లేవు. ఇతరులు యొక్క పాప భారమును వేదనలను ఆయన మీద వేసుకొనెను. దైవికమైన ప్రేరేణతో ఆయన మానవులతో సంబంధము పెట్టుకొని, ఆయనే అపరాధిగా శిక్షననుభవించి మానవ జాతి యంతటికి ప్రతినిధి అయ్యాడు. మన పాపముల వలన తెరవబడిన పాతాళమును మూసివేయుట ద్వారా దేవుని నుండి మనలను వేరు చేయలేని విధముగా సహాయపడినాడు" ది బైబిలు ఎకో అండ్ సైన్స్ ఆఫ్ టైమ్సు, ఆగష్టు 1, 1892.

"సహోదరుడా! ఉన్నపాటుననే రమ్ము, నీవెంత పాపివైనను ఎంత చెడిపోయినవాడవైనను, నీ పాపభారమంతయు యేసుపై మోపి, విశ్వాసము ద్వారా ఆయన యొక్క యోగ్యతలను పొందుము. కృప అందుబాటులో ఉండగానే రమ్ము. పశ్చాత్తాపముతోను, నలిగిన హృదయముతోను రమ్ము, దేవుడు నిన్ను అపరిమితముగా క్షమిస్తాడు. మరొక అవకాశమును వదిలి పెట్టుకొనవద్దు. పాపుల గుంపులో నుండి వెలుపలికి వచ్చి కృపా స్వరమును విని క్రీస్తు అనుగ్రహించు వెలుగులోనికి ప్రవేశించుము. నీ గర్వము, నీ అపనమ్మకము చేత అనుగ్రహించబడుచున్న కృపను తిరస్కరించకుము. కోతకాలము ఎండాకాలం ముగిసినవి. అయితే మనము ఇంకా రక్షింపబడలేదు" ఎలెన్ జి వైట్, సంఘము కొరకు సాక్ష్యములు, సంపుటి 5, పుట 353.

## చర్చనీయాంశములు

1. "మనకు విశ్వముతో సంబంధమున్నట్లు చూస్తున్నాము" అని ఫ్రాన్సిస్కో జోస్ మోరినో వ్రాసాడు. మన అవివేకమును గూర్చి మనకు తెలుసు. అందువలననే మనలో అభద్రతా భావము ఉంది. దాని ఫలితముగా మనము భయపడుతున్నాము. "విశ్వాసమునకు మరియు ఆలోచనకు మధ్య ప్రాధమిక భయము మరియు మానవుని స్థితి" న్యూయార్కు, హార్పర్ & రో పబ్లిషర్సు 1977) దీనిని ఈ వారము మనము ఎఫెసి 3:17–19లో చదివి దానితో పోల్చి చూడుము. రెండింటి మధ్య ఉన్న తేడాను గూర్చి చర్చించండి.

2. యేసు నందు నమ్మకముంచుట వలన సంతోషమును దేవుడు మనకు వాగ్దానము చేయుచున్నాడు. సంతోషము ఆనందముతో సమానమేనా? ఎల్లప్పుడు ఆనందముగా ఉండాలా? మనము సంతోషముగా ఉండని యెడల మన క్రైస్తవ అనుభవములో లోపముందా? మీ జవాబులను చర్చించండి.

3. దేవుని యొక్క సంపూర్ణతతో నింపబడుట (ఎఫెసి 3:19) అనే విషయమును గూర్చి చర్చించండి. దాని భావమేమి? దాన్ని మన జీవితములలో ఎట్లు అనుభవించగలము?

## పాఠము యొక్క సారాంశము

నిబంధన అనునది ఏదో లోతైన వేదాంతమునకు సంబంధించిన భావము కాదు, దానికి బదులు క్రీస్తుతో మనకున్న రక్షణ బాంధవ్యము యొక్క పరిమితులను అది వివరిస్తుంది. నిబంధన బాంధవ్యము వలన ఆశ్చర్యకరమైన ఆశీర్వాదాలను ఇపుడు మరియు క్రీస్తు తిరిగి వచ్చినపుడు పొందుదుము.

❖❖❖

పెద్దల సబ్బాతుబడి పాఠములు

# క్రీస్తునందు విశ్రాంతి

మూడవ త్రిమాసము

జూలై, ఆగష్టు, సెప్టెంబరు-2021

## 1 పాఠం - ఒక 24-7 సమాజములో జీవించుట

కంఠత వచనం "......................................." కీర్తన 84:2

ఆదివారం : ప్రయాసపడి భారము మోయుచున్నవారు (మత్తయి 11:28)

సోమవారం : నిరర్ధకముగా పరుగెట్టుట (యిర్మి 45:1-5)

మంగళవారం : పాతనిబంధన గ్రంథములో విశ్రాంతి (2సమూ 7:12)

బుధవారం : క్రొత్త నిబంధన గ్రంథములో విశ్రాంతి (మార్కు 30:32)

గురువారం : విశ్రాంతి లేని దేశ ద్రిమ్మరి (ఆది 4:1-12)

- జూలై 3, సబ్బాతు దినమున ఈ పాఠమును అధ్యయనము చేయండి.

## 2వ పాఠం - అశాంతి మరియు తిరుగుబాటు

కంఠత వచనం "......................................." 1 కొరింథి 10:11

ఆదివారం : అరణ్యములో అశాంతి (సంఖ్యా 11:1-15)

సోమవారం : అది వ్యాప్తి చెందేది (సంఖ్యా 12:1-3)

మంగళవారం : అశాంతి తిరుగుబాటుకు నడిపించును (సంఖ్యా 14:1-10)

బుధవారం : మధ్యవర్తి ......... (సంఖ్యా 14:11-19)

గురువారం : విశ్వాసమునకు విరుద్దముగ అనుమానం (సంఖ్యా 14:39-45)

- జూలై 10, సబ్బాతు దినమున ఈ పాఠమును అధ్యయనము చేయండి.

# Notes :